సంక్షేమ పాలనకు జగనే రావాలి

- అధికారం కోసమే టీడీపీ ఆరాటం
- కాకినాడ రూరల్ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే కన్నబాబు


తూరంగిలో నిర్వహించిన బైక్ ర్యాలీ వెంట ప్రచార రథంపై కురసాల కన్నబాబు


తూరంగిలో ఎమ్మెల్యే కన్నబాబును గజమాలతో సత్కరిస్తున్న ప్రజలు

కాకినాడ సిటీ: ఎన్నికలకు ముందు మోసపూరిత హామీలివ్వడం, ఎన్నికల తర్వాత మోసం చేయడం టీడీపీ నైజమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. బుధవారం కాకినాడ రూరల్ మండలం తూరంగిలో పార్టీ నాయకులు బలగం ప్రసన్నకుమార్, అడ్డూరి ఫణీశ్వర రవిరాజ్‌కుమార్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ, తురంగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి సూర్య ప్రకాశరావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యే కన్నబాబుకు గజమాలలు వేసి, ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్నో అమలుకాని, బూటకపు హామీలను ప్రజలకు ఇస్తున్నారన్నారు. ఇటీవల టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.4 వేల పింఛను ఇప్పుడు వారి కరపత్రాల్లో కనపడటం లేదని విమర్శించారు. గతంలో డ్వాక్రా రుణాలు, రైతు రుణాలు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇలా 600కు పైగా అబద్ధపు హామీలిచ్చి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిలో ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, ఆ మేనిఫెస్టో వెబ్‌సైట్ నుంచి మాయం చేశారని గుర్తు చేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను బీజేపీ నేతలు కూడా ఇష్టపడడం లేదన్నారు. దీన్ని ప్రజలంతా గమనించాలని చెప్పారు. రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్లు చెబితేనే ఎన్నో పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. చంద్రబాబు పేరు చెబితే మాత్రం దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఏమీ గుర్తుకు రావని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పనులు చేపట్టామన్నారు. ఒక్క తూరంగి గ్రామంలోనే రూ.214 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్టు వివరించారు. రూ.15 కోట్లతో సచివాలయాలు, హెల్త్ సెంటర్ భవనాలు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, కమ్యూనిటీ హాల్, శ్మశాన వాటిక అభివృద్ధి, ఇంటింటికీ కుళాయిలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి పైపులైన్ల విస్తరణ, బొడ్డు చెరువు అభివృద్ధి, పలు దేవాలయాల అభివృద్ధి చేసినట్టు వివరించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పార్టీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, అనిశెట్టి రామకృష్ణ, గరికిన అప్పన్న, రొంగల వెంకటేశ్వరరావు, కడలి సాయి, గరికిన కుమార్‌రాజా, జగడం శ్రీహరి, ఆతం భద్రం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఓఎన్‌జీసీ పరిహారం ఇప్పిస్తా

- 18 నెలల్లో లబ్ధిదారుల సొంతింటి కల సాకారం చేస్తా
- ఏటిమొగ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి


సభకు హాజరైన మత్స్యకార ప్రతినిధులు, ప్రజలు


ఏటిమొగలో మత్స్యకారులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: చమురు నిక్షేపాల అన్వేషణ కారణంగా నష్టపోతున్న మత్స్యకారులందరికీ ఓఎన్‌జీసీ పరిహారం అందేలా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మత్స్యకార ప్రాంతమైన ఏటిమొగలో విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్నెన్నడూ లేనంతగా ఆయనకు ఏటిమొగ ప్రాంతంలో మత్స్యకారులు బ్రహ్మరథం పట్టారు. జగన్నాథపురం నుంచి ఏటిమొగ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా ద్వారంపూడికి మద్దతుగా నినదిస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా 14–15 డివిజన్లలోని ఏటిమొగ తూర్పుపేట వద్ద జరిగిన ఎన్నికల ప్రచార సభలో ద్వారంపూడి మాట్లాడుతూ మత్స్యకారుల ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించిన టీడీపీ అభ్యర్థి వనమాడి కొండబాబు ఆ వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మత్స్యకారులకు పరిహారం అందించే విషయంలో తాను చేపట్టిన ఉద్యమానికి జనసేన, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు సంఘీభావం తెలిపినప్పటికీ, సాటి మత్స్యకారుల సమస్య విషయంలో వనమాడి మద్దతు ప్రకటించకపోవడాన్ని చూస్తే ఆయన వ్యవహార శైలి అర్థమవుతుందన్నారు. మత్స్యకారులకు సంబంధించిన కొండబాబు కల్యాణ మండపాన్ని అతని కబంధ హస్తాల నుంచి విముక్తి కలిగించి, మత్స్యకారులకు ప్రయోజనం కలిగేలా అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. కొండబాబు ఆక్రమణలో ఉన్న శ్మశానవాటిక స్థలానికి కూడా విముక్తి కలిగించి గ్రామానికి చెందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రధానంగా ఏటిమొగ ప్రాంతానికి చెందిన 1400 మత్స్యకారుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని, తాను విజయం సాధించిన 18 నెలల వ్యవధిలో వీరందరికీ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ఇప్పటికే అర్హులందరికీ మత్స్యకార భరోసా ద్వారా న్యాయం చేశారని, మరెంతో మందికి సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. ప్రధానంగా మత్స్యకార వర్గాలకు రాజకీయంగా ఉన్నత స్థానాన్ని కల్పించానన్నారు. గతంలోనే బందన హరికి అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ పదవి ఇచ్చామని, ఇప్పుడు కర్రి పద్మశ్రీకి ఎమ్మెల్సీ ఇచ్చామన్నారు. మత్స్యకారులు రాజకీయంగా కూడా ఉన్నత స్థాయికి ఎదగాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారన్నారు. ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఆయన వెంట ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సీనియర్ నాయకులు కాటాడి జానికిరామ్, నగర ఉపాధ్యక్షుడు చక్కా చక్రవర్తి, మాజీ కార్పొరేటర్ భీమరాజు, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబుతో పాటు, పెద్ద సంఖ్యలో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక పెద్దలు హాజరయ్యారు.

సంక్షేమం, అభివృద్ధే జగన్ అజెండా

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కన్నబాబు, సునీల్
- కరప, వలసపాకలలో ఎన్నికల ప్రచారం


కరపలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కన్నబాబు, సునీల్, యాంకర్ శ్యామల

కరప: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే అజెండాగా ఐదేళ్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు అన్నారు. ప్రతి కుటుంబానికి మేలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉండి, వచ్చే ఎన్నికల్లో గెలిపించడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కరపలో బుధవారం యాంకర్ శ్యామలతో పాటు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఎంపీటీసీ మద్దూరి భవాని, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, సాదే లోహిదాస్, రాఘవులు, వలసపాకలలో సర్పంచ్ వాసంశెట్టి రామారావు, వింత సురేష్, చాట్ర శ్రీను, వనుం భాస్కర్, వాసంశెట్టి సత్తిబాబు, త్రిమూర్తులు తదితర గ్రామ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు ఓటేసి, తనను, సునీల్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ముందుగా అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. తర్వాత దుర్గాదేవి, రామాలయాల్లో పూజలు చేశారు. గ్రామాల్లో కన్నబాబు, సునీల్ ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. మహిళలు పూల వర్షం కురిపిస్తూ, హారతులిచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసిన సీఎం జగన్‌ను మరువలేమని, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే, ఎంపీలను గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని రైతులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోద్బలంతోనే పార్టీలకతీతంగా, అర్హులందరికీ ఇళ్ల స్థలాల పట్టాలిచ్చామని, గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించామని చెప్పారు. సచివాలయం, ఆర్బీకేలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, పాఠశాలల ఆధునీకరణ వంటి అభివృద్ధి పనులు చేసి, సంక్షేమ పథకాలు అందించామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు సాదే లోహిదాస్, గోన శ్రీను, చిన్నారి మురళీకృష్ణ, తుమ్మలపల్లి చంద్రనగేష్, నక్కా సత్తిబాబు, మద్దూరి భాస్కర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ద్వారంపూడి గెలుపు.. అభివృద్ధికి మలుపు


ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి భార్య మహాలక్ష్మి


తండ్రికి మద్దతుగా ప్రచారం చేస్తున్న డాక్టర్ ప్రణీత


తండ్రి కోసం ఓటు అభ్యర్థిస్తున్న డాక్టర్ అంజని

- ఎన్నికల ప్రచారంలో భార్య, కుమార్తెలు


కాకినాడ: వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విజయంతోనే కాకినాడ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధిలో అగ్రగామిగా నిలవగలదని ఆయన భార్య మహాలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బుధవారం 45వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయా ప్రాంతాలకు వెళ్లిన ఆమెకు ప్రజలకు ఘన స్వాగతం పలికారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గడచిన ఐదేళ్లలో కాకినాడ నగరాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దిన చంద్రశేఖరరెడ్డికి ప్రజలంతా ఆశీస్సులు అందజేయాలని కోరారు. ఆమె వెంట మాజీ కార్పొరేటర్ కర్రి శైలజ, ఇతర నాయకులు ఉన్నారు.

కుమార్తెల ప్రచారం

ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడికి మద్దతుగా కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. 13వ డివిజన్‌లోని సాంబమూర్తినగర్ మూడో వీధి, జ్యోతుల కాలనీ, రెవెన్యూకాలనీ, వెంకటేశ్వరనగర్ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. 2019 తరువాత జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని తండ్రి ద్వారంపూడిని మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక నాయకులు హేమంతకుమార్, మూలే నాగిరెడ్డి, కొప్పుల బుజ్జి, బందం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కాగా 8వ డివిజన్‌లోని గొడారిగుంట, రాజ్యలక్ష్మీనగర్, కొత్తకాకినాడ, రాజా రామ్మోహనరాయ్‌నగర్‌ల్లో ద్వారంపూడి కుమార్తె డాక్టర్ అంజని ఎన్నికల ప్రచారం చేశారు. తండ్రి ద్వారంపూడిని మూడోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధిపై స్పష్టమైన విజన్ కలిగిన చంద్రశేఖరరెడ్డిని గెలిపించుకోవడం ద్వారా అన్ని ప్రాంతాల ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. స్థానిక నాయకులు బళ్ల సూరిబాబు ఆధ్వర్యంలో ఈ ప్రచారం సాగింది.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్వో


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో జె.వెంకటరావు

కాకినాడ: పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు బుధవారం ఆదేశించారు. నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి జేఎన్‌టీయూకే ఆవరణలోని సివిల్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. సిటీ పరిధిలో 234 పోలింగ్ బూత్‌ల్లో జరిగే ఓటింగ్ అనంతరం మే 13వ తేదీ సాయంత్రం ఈవీఎంలను తరలించే జేఎన్‌టీయూకే వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. ఆయా పోలింగ్ స్టేషన్ల నుంచి తీసుకువచ్చే ఈవీఎంలు, ఇతర సామగ్రి కోసం 15 రిసీవింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు. వాటికి పటిష్ట భద్రత కల్పించడంతో పాటు, అక్కడ విధుల్లో ఉండే ఎన్నికల ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ రమేష్ బాబు, ఇతర అధికారులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 3,136 ఓట్ల నమోదు


పీఆర్ కళాశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్

కాకినాడ సిటీ: రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా 4,250 మంది ఉద్యోగులకు 3,136 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ తెలిపారు. బుధవారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఆయన జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన ఉద్యోగులతో కలెక్టర్ నివాస్ మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తూ, పొరుగు జిల్లాలో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు మంగళ, బుధవారాల్లో ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సుమారు 74 శాతం మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారన్నారు. రెండో రోజు తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఉద్యోగులతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించినట్టు తెలిపారు. ఆయన వెంట డీఆర్వో డి.తిప్పేనాయక్, కాకినాడ కమిషనర్ జె వెంకటరావు, జిల్లా ఉపాధి శిక్షణాధికారి, జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి జి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జేసీ రామ్‌సుందర్‌రెడ్డి పరిశీలన

రెండో రోజు బుధవారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ప్రజలకు చేరువగా రోటరీ సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణన్

బోట్‌క్లబ్: సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు రోటరీ పబ్లిక్ ఇమేజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సంస్థ మాజీ గవర్నర్ లక్కరాజు సత్యనారాయణన్ అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో బుధవారం జరిగిన క్లబ్ కాకినాడ సన్‌రైజ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడు కమల్ సందీప్, రోటరీ జిల్లా పబ్లిక్ ఇమేజ్ కమిటీ చైర్మన్ రంగారావు మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాలు ప్రజలకు చేరవేయడానికి పబ్లిక్ ఇమేజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేస్తామన్నారు. క్లబ్ ప్రతినిధులు సీతారాం, నగధర్ పాల్గొన్నారు.

మందుబాబులను పోలింగ్ కేంద్రాల్లో నిషేధించాలి

బోట్‌క్లబ్: మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ఎంత ప్రమాదమో, మద్యం సేవించి పోలింగ్ ప్రక్రియకు రావడం అంతకు మించిన చేటని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. మద్యం సేవించి పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఏజెంట్లను పూర్తిగా నిషేధించాలంటూ కాకినాడ సిటీ ఎన్నికల ఆర్ఓ జె.వెంకటరావుకు ఆయన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. మందుబాబులు పోలింగ్ కేంద్రాల వద్ద సంచరించకుండా ఈ నెల 13న ప్రత్యేక బృందాలతో బ్రీత్ ఎనలైజర్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పోలింగ్ బూత్‌లకు వంద మీటర్ల దూరంలో పార్టీ అభ్యర్థులు, వారి వ్యక్తుల సమూహాలు లేకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. మద్యం మత్తుతో పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశించిన వారు ఈవీఎంలను ధ్వంసం చేసే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

అందరికీ అండగా రెడ్‌క్రాస్


హంట్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు


బోట్‌క్లబ్: ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో, ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలుస్తుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రామారావుపేట వద్ద ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో కాకినాడ ఐడీఏ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీ డూన్ హంట్ విగ్రహానికి పూలమాల వేశారు. కాకినాడలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధుల సంక్షేమ ఆశ్రమం, బ్లడ్‌బ్యాంక్, దివ్యాంగుల పాఠశాల, తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు ఆరోగ్య వసతి వంటి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. సంఘ అధ్యక్షుడు నాగేంద్ర రెడ్‌క్రాస్ కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మనోజ్, స్వరూప్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రేపు దుర్గాదేవి ప్రతిష్ఠా వార్షికోత్సవం


కరపలోని కనకదుర్గ అమ్మవారు

కరప: కనకదుర్గ అమ్మవారి 36వ ప్రతిష్ఠా వార్షికోత్సవ మహోత్సవాన్ని స్థానిక హైస్కూల్ సెంటర్ వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో ఈ నెల పదిన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో పాడిపంటలు వృద్ధి చెంది, ప్రజలు సుఖశాంతులతో ఉండేందుకు భక్తుల విరాళాలతో దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించినట్టు చెప్పారు. పదో తేదీన ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రసాద వితరణ చేస్తారన్నారు. అదే రోజు ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తారన్నారు. హైస్కూలు ఆవరణలో మహాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ధాన్యం ట్రాక్టరు బోల్తా


కెనాల్ రోడ్డులో బోల్తా పడిన ధాన్యం లోడ్ ట్రాక్టరు

సామర్లకోట: కెనాల్ రోడ్డులో మాండవ్య నారాయణ స్వామి ఆలయం వంతెన వద్ద బుధవారం ధాన్యం లోడ్ ట్రాక్టరు బోల్తా పడింది. ఉండూరు గ్రామం నుంచి కెనాల్ రోడ్డులో ద్వారపూడి వెళుతున్న సమయంలో ట్రాక్టరు అదుపు తప్పింది. ట్రాక్టరు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎవరికీ అపాయం జరగలేదు. మరో ట్రాక్టరులో ధాన్యాన్ని లోడ్ చేసి, ద్వారపూడి రైసు మిల్లుకు తరలించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత


మట్టపర్తి సత్యనారాయణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ 50వ డివిజన్ టీడీపీ సీనియర్ నాయకుడు మట్టపర్తి సత్యనారాయణ బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో పార్టీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కార్యక్రమంలో కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, పార్టీ నాయకులు పెంకె సత్తిబాబు, చింతా ఈశ్వరరావు, కడియాల చిన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు


కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న వెంకట్రావు

కాకినాడ రూరల్: దేశంలో బాల్య వివాహాలను నిషేధిస్తూ 2006లో మరిన్ని కఠినమైన నిబంధనలు అమల్లోకి వచ్చాయని జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటుక్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో బాల్య వివాహాలు–చట్టాలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల, గర్భం దాల్చి అకాల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కొంతమంది పిల్లలు బలహీనంగా పుట్టే అవకాశం ఉందన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండాక మాత్రమే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహం చేస్తే వరుడు కుటుంబ సభ్యులతో పాటు, వివాహానికి హాజరైన వారందరిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధి అడబాల రత్నప్రసాద్ పాల్గొన్నారు.

బార్ ఎన్నికలకు 13 నామినేషన్లు


నామినేషన్లు దాఖలు చేస్తున్న విశ్వేశ్వరరావు, చక్కా శ్రీనివాస్

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ 2024–25 కార్యవర్గానికి ఈ నెల 17న జరిగే ఎన్నికలకు తొలి రోజు బుధవారం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష పదవికి ముత్తింటి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి కేవీ భద్రరావు, ప్రధాన కార్యదర్శి పదవికి చక్కా ఎస్‌వీఎస్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పాశం శంకర్ శ్రీనివాస్, కోశాధికారిగా వెంకటరెడ్డి బహదూర్ షా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా డి.అశోక్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీ కె.దయానందరాజు, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా ఏవీసీహెచ్‌ఎస్ఎస్ మూర్తి, సీనియర్ కమిటీ మెంబర్‌గా జీవీ దుర్గాప్రసాద్, లేడీ రిప్రజెంటేటివ్ పదవికి జి.నాగసునీత, లేడీ కమిటీ మెంబర్‌కు ఎం.సరోజిని, కమిటీ మెంబర్లుగా కె.ఏడుకొండలు, ఎంఏఎస్ఎస్ బాబు నామినేషన్లు దాఖలు చేశారని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్, సీనియర్ న్యాయవాది టీపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 9 వరకు కొనసాగుతుందని చెప్పారు.

దరఖాస్తుల స్వీకరణ

తుని: పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ లోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. విద్యార్థులు ఎస్ఎస్‌సీ, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, కలర్ ఫొటోలు ఈ–మెయిల్ ఐడీ, ఆధార్ లింక్ కలిగిన ఫోన్ నంబర్‌తో ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.